క్లుప్తంగా

ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు తగదు

కడప సెవెన్‌రోడ్స్ : ఉద్యోగాల్లో క్రీడా కోటాను రద్దు చేయడం తగదని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు, నగర ఉపాధ్యక్షులు విజయ్ ఉదయ్ అన్నారు. శుక్రవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ విధానం రద్దు చేయడం సరికాదన్నారు.

ఎస్ఐ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎప్పుడు ఈవెంట్స్ నిర్వహిస్తారో తేదీలను తెలపాలన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్, శివ, ఏకాదశిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన బోగా పార్వతమ్మ రక్తదాన సేవా సమితి వ్యవస్థాపకులు బోగా చిన్నయ్య శుక్రవారం విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. స్థానిక శంకరాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికీ ఆయన వీటిని అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ, ఉపాధ్యాయ బృందం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ నేతల నిరసన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఏపీసీసీ సూచనల మేరకు కడప సిటీ కాంగ్రెస్ నేత విష్ణుప్రీతం రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఎర్రముక్కపల్లి సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, ఓబీసీ కో కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో జాబ్‌డ్రైవ్


జాబ్‌డ్రైవ్‌కు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌కు చక్కటి స్పందన లభించింది. కళాశాల జేకేసీ, ఐసీఐసీఐ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికల్లో రాతపరీక్ష, ఇంటర్వ్యూ చేయగా 9 మంది అభ్యర్థులు రిలేషన్‌షిప్ మేనేజర్ ఉద్యోగాలకు ఎంపికై నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ తెలిపారు. అదే విధంగా క్యూవెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సి.వి. విశ్వనాథరావు, జేకేసీ మెంటార్స్ ఎస్. సారధి, కె. మంజుల పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్: కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రాయలసీమ విద్యార్థి యువజన రాష్ట్ర కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని ఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శివ, నగర సహాయ కార్యదర్శి వినయ్, నగర ఉపాధ్యక్షు డు అంజయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు .

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామ, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర మహాసభలు ఈనెల 9వ తేదీన విజయవాడలోని గాంధీనగర్ ఫిలిం ఛాంబర్‌లో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామగంగాధర్ రెడ్డి యాదవ్, ఎం.దేవానందకుమార్ పిలుపునిచ్చారు. మహాసభల సందర్భంగా నిర్వహించే ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికలను జయప్రదం చేయాలని వారు కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని బెల్లం మండి వీధిలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గోరు గోల్డ్ జేకే యూత్ అధ్యక్షుడు లయన్ పటాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్ఆర్ ముందస్తు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు విద్యాసామాగ్రిని అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అహ్మద్ బాష, ఉపాధ్యాయులు షేక్ ఆరిఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష

– డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పేదల సమస్యలను ఇంటివద్దకే వెళ్లి పరిష్కరించే వేదిక ‘జగనన్న సురక్ష’ కార్యక్రమమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక 45వ డివిజన్‌లోని భగత్‌సింగ్ నగర్, 32వ డివిజన్ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాల్లో ఆయన పాల్గొని, సర్వీస్ రిక్వెస్ట్ స్పాట్ రిజిస్ట్రేషన్, దరఖాస్తుల పరిశీలన కౌంటర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు 99 శాతం ప్రజలకు చేరువ అయ్యాయన్నారు. మిగిలిన ఒక్క శాతంలో ఎవరైనా అర్హులు ఉంటే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వారికి మేలు చేకూరుస్తున్నామన్నారు. సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి ప్రజలకు అవసరమైన సేవలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారన్నారు. వాటిని జగనన్న సురక్ష శిబిరాల్లో పరిష్కరిస్తున్నారన్నారు. 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 30వ తేదీ వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఏవైనా సందేహాలుంటే 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి జగనన్నకు చెబుదాం ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య, కార్పొరేటర్లు అంకమ్మ, జఫ్రుల్లా, షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు జి. శ్రీనివాసులరెడ్డి, జయచంద్రారెడ్డి, తోటక్రిష్ణ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


45వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


7వ డివిజన్‌లో సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సురేష్ బాబు

అభివృద్ధి నిరోధకులకు అవకాశం ఇవ్వద్దు

– మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: జిల్లా ప్రజలు అభివృద్ధిని చూసి ఓటేయాలని... అభివృద్ధి నిరోధకులకు అవకాశం ఇవ్వద్దని కడప మేయర్ కె. సురేష్ బాబు సూచించారు. శుక్రవారం స్థానిక 7వ డివిజన్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన అర్హులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్‌సెల్ నామమాత్రంగా ఉండేదని, ఇంటి స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్ల కోసం వేల అర్జీలు వచ్చేవన్నారు. అయితే ఒక్క దానికి కూడా పరిష్కారం లభించేది కాదని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు, పింఛన్లు, ఇంటి స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వడానికి సరిపడినంత ప్రభుత్వ భూమి లేకపోతే 136 ఎకరాలు కొనుగోలు చేసి ఇవ్వడం జరిగిందని తెలిపారు. వైఎస్ఆర్ మరణం తర్వాత అభివృద్ధి కోసం జిల్లా ప్రజలు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. జిల్లాపై ఉన్న మమకారంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తున్నారన్నారు.

జగనన్న సురక్ష ద్వారా ఇంకా ఎక్కడైనా అర్హులు మిగిలిపోయి ఉంటే వారందరికీ మేలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, 7వ డివిజన్ కార్పొరేటర్ మల్లీశ్వరి, డివిజన్ ఇన్‌చార్జి గంగరాజు, రాణాప్రతాప్, రామ్మోహన్‌రెడ్డి, బాలక్రిష్టారెడ్డి, కె. సూర్యనారాయణరావు, రామలక్ష్మణ్ రెడ్డి, కె. కొండయ్య పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని వసతిగృహాన్ని, వంటశాలను వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం విశ్వవిద్యాలయ వసతిగృహాలను వారు సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య విజయవాడలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ప్రగతి గురించి, అకడమిక్, పరిశోధన అంశాల గురించి వివరించారు. విశ్వవిద్యాలయ అవసరాల గురించి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మంత్రి విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో నడిపించాలని అందుకు అవసరమైన వనరులను సమకూర్చుతామని హామీ ఇచ్చారు.

సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించి, వారి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. యోగివేమన యూనివర్సిటీ అనుబంధ ఇంజనీరింగ్ కాలేజి ఆవరణలో గత మూడు రోజులుగా ఒప్పంద అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘీభావం తెలిపారు.

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి



కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తలమంచి రమణారెడ్డి ఎంపికయ్యారు. ఈయన పెనగలూరులోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలను విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

విద్యార్థులకు బహుమతులు


విజేతలతో ఇంటాక్ సభ్యులు, పాఠశాల ప్రతినిధులు

కడప కల్చరల్ : భారత జాతీయ కళా వారసత్వ సంస్కృతి పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఇటీవల కడప మున్సిపల్ హైస్కూలులో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలువురు విద్యార్థులకు బహుమతులు లభించాయి. జిల్లా సంప్రదాయ ఆహారం, వంటకాలు, పోషక విలువలు తదితర అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో 29 మందికి బహుమతులు లభించాయి. శుక్రవారం ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నాగమణి, పీఈటీ విజయలక్ష్మిల సహకారంతో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శి గౌరీశంకర్, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్ కొండారెడ్డి, ఇంటాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఉమ్మడి సంస్కృతిని అమలు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం బీజేపీ తీరుకు నిరసనగా నగరంలోని రవీంద్రనగర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

– డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: కుటుంబ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, స్టేట్ ఆఫీసర్ పర్వీన్ సుల్తానా తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ జనాభా దినోత్సవం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య అమృత మహోత్సవం, కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిద్దాం, ప్రతిజ్ఞ చేద్దాం అనే నినాదంతో కూడిన అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రజల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ అంశాలకు సంబంధించి విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. రెండవ ఫేస్ కింద ఈ నెల 11 నుంచి కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించే వారికి తగు సలహాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, మలేరియా ఆఫీసర్ మనోరమ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాగరాజు తదితరులు

21న అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రొద్దుటూరు : ఈనెల 21న పలువురు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జగనన్న హరిత వనాలు కార్యక్రమంలో భాగంగా రూ.4 కోట్లతో మైదుకూరు రోడ్డులో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వంద అడుగుల జాతీయ పతాకం స్థూపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఇరువైపులా రోడ్డును విస్తరించడం, ఫుట్ పాత్‌లు నిర్మించడం జరుగుతుందన్నారు. స్మార్ట్ సిటీ పేరుతో పట్టణాన్ని అందంగా తయారు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామని, తొలి విడతలో ఈ రోడ్డును ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా రూ.1.20 కోట్లతో టెండర్లు నిర్వహించామని, మిగతా పనులను త్వరగా చేపడుతామన్నారు. ఈనెల 21న ఈ అభివృద్ధి పనులతోపాటు పలు పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, పర్యాటక శాఖ మంత్రి రోజ, మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎంపీ సింగారి సంజీవ్ కుమార్ తదితర ప్రముఖులను ఆహ్వానించామన్నారు. గతంలో ఈ రోడ్డులో డివైడర్లు, డ్రైనేజి కాలువలను నిర్మించి అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే అన్నారు. కిలోమీటరు పరిధిలో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రభుత్వ విప్

రైల్వేకోడూరు : పట్టణంలోని జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు చింతంనగర్‌లో రోడ్లు, డ్రైనేజి నిర్మాణాన్ని చేపట్టాలని కోరగా స్పందించిన కొరముట్ల రూ.20 లక్షలు కేటాయించారు. అలాగే పట్టణంలోని జగదంపల్లిలో శుక్రవారం సీసీరోడ్డు పనులకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు భూమిపూజ చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోట సాయి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, సుధాకర్‌రాజు, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లె ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీపుల్లయ్య స్వామి శివైక్యం

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలోని శ్రీ సద్గురు సమర్థనారాయణ స్వామి ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీపుల్లయ్య స్వామి శుక్రవారం సాయంత్రం శివైక్యం చెందారు. వారం రోజులుగా అనారోగ్యం కారణంగా ఈయన హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం పరిస్థితి విషమించి మరణించారు. శ్రీపుల్లయ్యస్వామి ప్రస్తుత ఆశ్రమ పీఠాధిపతి గోపాలస్వామికి తండ్రి. పుల్లయ్య స్వామి గతంలో ఉప్పరపల్లె గ్రామ కరణంగా విధులు నిర్వహించారు. ఎన్టీ రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరణం వ్యవస్థను తొలగించడంతో ఈయన విధులకు స్వస్తి చెప్పి ఉప్పరపల్లె సద్గురు సమర్థ నారాయణ స్వామి ఆశ్రమాన్ని 1990లో స్థాపించారు. పుల్లయ్య స్వామి భౌతికకాయం భక్తుల దర్శనార్థం ఉప్పరపల్లె ఆశ్రమంలో శనివారం ఉదయం 11 గంటల వరకు ఉంటుందని, ఆ తర్వాత ఆశ్రమంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆశ్రమ పీఠాధిపతి గోపాలస్వామి పేర్కొన్నారు.

మహిళలకు ఆపన్నహస్తం వన్‌స్టాప్ సెంటర్

– ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్నహస్తం వన్‌స్టాప్ సెంటర్ అని, అక్కడ ఒకేచోట అనేక సేవలు అందుతున్నాయని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత అన్నారు. శుక్రవారం కడప నగరంలోని వన్‌స్టాప్ సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటిసేవలు ఉన్నాయన్నారు. గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాలలో మహిళలు వన్‌స్టాప్ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181, ఉమెన్ హెల్ప్‌లైన్, 1098, చైల్డ్ హెల్ప్‌లైన్, 100 పోలీసు హెల్ప్‌లైన్, టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగి ఉండలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారిని సంప్రదించాలన్నారు. అనంతరం జడ్జి రిజిష్టర్లను పరిశీలించి వన్‌స్టాప్ సెంటర్‌లో ఉన్న మహిళలతో మాట్లాడారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.


వన్‌స్టాప్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కవిత



శాకంబరి అలంకారం

కడప కల్చరల్ : కడప నగరం అమ్మవారిశాలలో శుక్రవారం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవికి శాకంబరిగా అలంకారం చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. అమ్మవారికి దాదాపు 60 రకాల కూరగాయలు, ఆకుకూరలతో కనువిందుగా అలంకారం చేశారు. సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో స్థానిక అర్చకుడు నాగ నరసింహా రోజంతా శ్రమించి 500 కిలోల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులను తలపించేలా వివిధ రకాల కూరగాయలతో కనుల పండువగా అలంకరించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు ఆర్యవైశ్య మహిళా మండలి ప్రతినిధులు అమ్మవారికి సారె సమర్పించారు. 108 మంది ముత్తయిదువులు సహస్ర కుంకుమార్చన సామూహికంగా నిర్వహించారు. సంఘం ప్రతినిధులు పెసల సత్యనారాయణ, శ్రీనివాసగుప్తా, వెంకట నరసింహులు, రామమహేష్, రాంప్రసాద్, కాంభోజి గోపాల్, యలిశెట్టి గోపాల్, వెంకట సుబ్బారావు, వాసుదేవుడు పాల్గొన్నారు.

– కడప నగరం హనుమప్పవీధిలోని శ్రీ నడివీధి గంగమ్మకు శాకంబరిగా అలంకారం చేశారు. ఆలయ ధర్మకర్త గోపాల్‌సింగ్ అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో కనుల పండువగా అలంకరించారు. స్థానిక భక్తులు హారతి పళ్లాలు, ప్రమిదలు తదితర వెండి సామగ్రిని అమ్మవారికి సమర్పించారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



కడప అర్బన్: కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం రిమ్స్ ఓపీ విభాగం ముందు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. వెంకట సుబ్బయ్య, పీవీ సుదర్శన్ మాట్లాడారు. ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎల్. భాస్కర్, బి. బాలాజీరావు, ఏసన్న, రామకృష్ణ, చెన్నయ్య, కార్యదర్శులు కొండయ్య, సురేష్, రాజారత్నం, కమిటీ సభ్యులు , రిమ్స్ కార్మికులు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణ ఉపాధ్యాయులకు ఉపయుక్తం


మాట్లాడుతున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్: నేటి ఆధునిక సాంకేతిక యుగంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సాంకేతిక శిక్షణ ఎంతో ఉపయుక్తం అని కడప ఎంఈఓ పాలెం నారాయణ అన్నారు. కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు కొనసాగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులకు సులభతర బోధన పద్ధతులు, పటిష్టమైన అభ్యసనం వంటి అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. జిల్లాలోని కాశినాయన, పోరుమామిళ్ల, ఖాజీపేట, పెండ్లిమర్రి, వల్లూరు, చెన్నూరు, సిద్దవటం మండలాలకు చెందిన 153 మంది శిక్షణ పొందుతున్నారన్నారు. ఏఎంఓ రామాంజనేయుల రెడ్డి, సహాయ కో ఆర్డినేటర్లు రమణమూర్తి, ఇమామ్ ఖాసీం, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, సాంకేతిక నిపుణులు డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

మరోసారి వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్‌గా బీహెచ్ ఇలియాస్



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కన్వీనర్‌గా బీహెచ్ ఇలియాస్ మరోసారి నియమితులయ్యారు. ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్ఆర్ఐ విభాగ కంట్రీ కన్వీనర్లు, అడ్వయిజరీ ప్యానెల్‌ను నియమించారు. గల్ఫ్ దేశమైన కువైట్‌లో మొట్ట మొదటిసారిగా ధైర్యంగా రాజకీయ కార్యకలాపాలు నిర్వహించిన వ్యక్తి ఇలియాస్. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తున్నారు.